విద్యుత్ బిల్లులు.. మారిన చెల్లింపులు

- ఏపీఈపీడీసీఎల్ సైట్‌లో పే చేసే అవకాశం
- యూపీఐ యాప్‌లకు చెక్ పెట్టిన ఆర్‌బీఐ
- అందుబాటులోకి ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్
- ప్రత్యక్ష చెల్లింపులు చేయాలని అధికారుల సూచన

నిడదవోలు: విద్యుత్ బిల్లులను ఇకపై వినియోగదారులు నేరుగా విద్యుత్తు పంపిణీ సంస్థకే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ప్రకటించింది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఏపీఈపీడీసీఎల్ సైట్ లేదా ఈస్టర్న్ పవర్ యాప్‌లో మాత్రమే బిల్లు చెల్లించాలని స్పష్టం చేసింది. యూపీఐ యాప్‌లైన గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం ఇతరత్రా వాటిలో బిల్లు చెల్లించే ఆప్షన్‌ను నిలిపివేసినట్టు ప్రకటించింది. విద్యుత్ శాఖ ఆఫీసుకు నేరుగా వెళ్లి చెల్లిస్తే మేలని వినియోగదారులకు సూచించింది. సాధారణంగా విద్యుత్ బిల్లుల చెల్లింపునకు నిర్దేశిత గడువు తర్వాత కూడా యాప్‌లో చెల్లించే అవకాశం ఉంటోంది. ఇకపై ఇలా చేయడం కుదరదని ఆ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఆర్‌బీఐ భారత్ బిల్ పేమెంట్స్ మార్గదర్శకాల ప్రకారం నేరుగా యాప్ నుంచి చెల్లింపులను నిలిపివేశారు.

ఆర్‌బీఐ నిబంధనలు ఇలా..

సమయపాలన పాటిస్తూ గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి విద్యుత్ బిల్లులు చెల్లించే కాలం చెల్లిపోయింది. గతంలో కంటే ప్రస్తుతం ఆన్‌లైన్ వినియోగం పెరిగింది. అధిక భాగం ఎల్‌టీ సర్వీసుల బిల్లులు మొత్తం ఆన్‌లైన్‌లోని యూపీఐ ద్వారా చెల్లిస్తున్నారు.మొదట్లో లావాదేవీలను ప్రోత్సహించాలని యాప్‌లో సర్వీసు చార్జీలు వసూలు చేసేవారు కాదు. కానీ, గతేడాది నుంచి నామమాత్రపు చార్జీలను యూపీఐ యాప్ నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. అయితే జూలై 1 నుంచి యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లింపులకు లైసెన్స్ అవసరమని ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయా యాప్‌ల యాజమాన్యాలు లైసెన్స్ పొందేందుకు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఆర్‌బీఐ ఉత్తర్వుల మేరకు ప్రస్తుతం బిల్ పేమెంట్ ఆప్షన్ తొలగించేశాయి.

ఇదీ కారణం...

ఆన్‌లైన్ చెల్లింపుల్లో మూడో పార్టీ యాప్స్ అయిన ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం ఇతరత్రా వాటిలో కరెంటు బిల్లు చెల్లిస్తే విద్యుత్ సంస్థకు సొమ్ము చేరడానికి మూడు రోజులు పడుతోంది. అలాగే కొన్ని పేమెంట్లు పలు కారణాలతో నిలిచిపోతున్నాయి. దీంతో ప్రత్యక్షంగా విద్యుత్ సంస్థకు నగదు చేరడం ఆలస్యం అవుతోంది. అదే ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్‌లో బిల్లు చెల్లిస్తే నేరుగా సంస్థ ఖాతాలోకే వస్తోంది. దీంతో యూపీఐ యాప్‌లలో నగదు చెల్లించినా, నేరుగా ఏపీఈపీడీసీఎల్ ఖాతాలో జమ కావాలని ఆర్‌బీఐ నిబంధన పెట్టింది. అందులో భాగంగా యాప్‌ల యాజమాన్యాలు పలు అనుమతులు తీసుకోవాల్సి ఉంది. అవి పూర్తయ్యాక పాత విధానం అందుబాటులోకి వచ్చే అవకాశముంది. ప్రస్తుతం గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఏపీఈపీడీసీఎల్ కన్స్యూమర్ అనే యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని నేరుగా బిల్లులు చెల్లించుకోవచ్చని విద్యుత్ శాఖ అధికారులు స్పష్టం చేశారు.


ప్రియమైన APEPDCL విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి

RBI మార్గదర్శకాలను అనుసరించి ఇక మీదట PhonePe , GPay , PayTM మరియు ఇతర UPI apps నుండు మీరు బిల్లులు చెల్లించుటకు మా APEPDCL చిహ్నం పేరు కనిపించదు.

కనుక మీరు APEPDCL Consumer app ని గూగుల్ ప్లే స్టోర్ (https://play.google.com/store/apps/details?id=com.apepdcl.easternpower&hl=en) నుంచి డౌన్లోడ్ చేసికొనిగాని లేదా మా డిస్కం వెబ్సైట్ https://www.apeasternpower.com నుంచి గాని బిల్లులు చెల్లించవచ్చును.

మా APEPDCL app లోగాని లేదా మా డిస్కం వెబ్సైటు లో గాని మీరు బిల్లులు చెల్లించునప్పుడు మీరు మీ PhonePe , GPay , PayTM లేదా ఇతర UPI apps ని వాడవచ్చును. అలాగే మీరు డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాల్లెట్స్/కాష్ కార్డ్స్ కూడా వాడవచ్చును.

ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్

ఇలా చెల్లించాలి



ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా చెల్లించాలి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మార్గదర్శకాల మేరకు ఇకపై వినియోగదారులు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎంలతో పాటు ఇతర యూపీఐ యాప్స్ ద్వారా నేరుగా విద్యుత్ బిల్లులను చెల్లించే అవకాశం లేదు. వినియోగదారులు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, వాలెట్, క్యాష్ కార్డుల ద్వారా కూడా విద్యుత్ బిల్లును చెల్లించవచ్చు. మొబైల్ యాప్‌ను ఈస్టర్న్ పవర్‌ప్లేను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్ లోడ్ చేసుకుని బిల్లులు చెల్లించవచ్చు. వినియోగదారులకు ఇచ్చే కరెంటు బిల్లుల కింద క్యూఆర్ కోడ్ ఉంటుంది. దీని ద్వారా స్కాన్ చేసి సెకన్‌లలో బిల్లులు చెల్లించవచ్చు.

– బి. వీరభద్రరావు, ఈఈ, (నిడదవోలు విద్యుత్ డివిజన్)

75 శాతం ఆన్‌లైన్..

నిడదవోలు విద్యుత్ డివిజన్ పరిధిలో తొమ్మిది మండలాలు, రెండు పురపాలక సంఘాలు ఉన్నాయి. దాదాపు 75 శాతం వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. నిడదవోలు విద్యుత్ డివిజన్‌లో గృహ, వాణిజ్య సర్వీసులు 2,48,338 ఉన్నాయి. ఇవి కాకుండా హెచ్‌టీ, పరిశ్రమలు, ప్రభుత్వ సర్వీసులు 6,527 వరకూ వినియోగిస్తున్నారు. ఇవే కాకుండా 30 వేల వ్యవసాయ కనెక్షన్లు కూడా ఉన్నాయి. మొత్తం విద్యుత్ బిల్లుల ద్వారా సబ్ డివిజన్‌లో నెలకు రూ.60 కోట్లు వస్తోంది. పరిశ్రమలు, హెచ్‌టీ పరిశ్రమల సర్వీసుల చెల్లింపులు బ్యాంకు ద్వారా చేస్తున్నారు. మిగిలిన వాటిలో 75 శాతం మంది ఆన్‌లైన్ ద్వారా కడుతున్నారు.

క్లుప్తంగా

బైక్‌పై బయలుదేరి వెళ్లి మరి రాలేదు

కొవ్వూరు: చాగల్లు మండలం ధారవరం గ్రామానికి చెందిన జంగం శేషగిరి అనే వ్యక్తి ఈనెల 2వ తేదీ నుంచి అదృశ్యమయ్యాడు. దీనిపై అతడి సోదరుడు జంగం శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఏఎస్సై జీజీ ప్రకాష్ తెలిపారు. ఈనెల 2న ఇంటి వద్ద నుంచి మోటార్ సైకిల్‌పై బయల్దేరిన శేషగిరి ఇంత వరకూ తిరిగి రాలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. శేషగిరి వేసుకుని వెళ్లిన మోటార్ సైకిల్ వాడపల్లి వశిష్ట మహర్షి వేద పాఠశాల సమీపంలో శుక్రవారం సాయంత్రం లభ్యమైనట్టు పేర్కొన్నారు. పలుచోట్ల వెతికినప్పటికీ శేషగిరి ఆచూకీ కోసం లభ్యం కాక పోవడం, మోటార్ సైకిల్ వాడపల్లిలో లభ్యం కావడంతో కొవ్వూరులో ఫిర్యాదు చేసినట్టు ఏఎస్సై ప్రకాష్ తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి


డ్రైన్‌లో ఆయిల్ బాల్స్ వేస్తున్న సిబ్బంది

ఉండ్రాజవరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పాలంగి సర్పంచ్ బొక్కా శ్రీనివాసు అన్నారు. పాలంగి గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కాపా నాగరాజు ఆధ్వర్యంలో యాంటీ లార్వా ఆపరేషన్‌లో భాగంగా దోమలు పెరగకుండా నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హసన్ జానీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆశ్రమానికి ఆర్థిక సాయం


దివ్యాంగుల, వృద్ధాశ్రమానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్సై సతీష్ దంపతులు

దేవరపల్లి: మండలంలోని గొల్లగూడెం వద్ద గల లగడపాటి రామలక్ష్మమ్మ, రమానాయుడు దివ్యాగుల, వృద్ధాశ్రమానికి గోపాలపురం ఎస్సై కె.సతీష్, హేమ దంపతులు శుక్రవారం రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ మొత్తాన్ని వారిద్దరూ ఆశ్రమం వ్యవస్థాపక అధ్యక్షుడు కాగిత భాస్కరరావుకు అందజేశారు. ఈ సొమ్ముతో ఆశ్రమానికి జనరేటర్ కొనుగోలు చేయనున్నట్టు ఆయన తెలిపారు. ఎస్సై సతీష్ దంపతులకు భాస్కరరావు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కొవ్వూరు: దొమ్మేరు–కొవ్వూరు మధ్య ఏషియన్ పెయింట్స్ కంపెనీ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ప్రమాదంలో రాజమహేంద్రవరం రూరల్ మండలానికి చెందిన గుండేపల్లి వెంకటరమణ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చాగల్లు వెళ్లి స్కూటీపై తిరిగి వస్తున్న వెంకటరమణ బ్రేక్ వేయడంతో కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు.

పర్యావరణ పరిరక్షణకు నిరంతరం కృషి



వాక్‌థాన్ నిర్వహిస్తున్న ఓఎన్‌జీసీ ఉద్యోగులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఓఎన్‌జీసీ నిరంతరం కృషి చేస్తోందని రాజమహేంద్రవరం ఎసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎసెట్ మేనేజర్ శాంతానుదాస్ అన్నారు. స్వచ్ఛత పఖ్వాడా 2024 క్యాంపెయిన్‌లో భాగంగా పరిశుభ్రత, వ్యర్థాలను వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం కంబాలచెరువు నుంచి పుష్కరఘాట్ వరకూ వాక్‌థాన్ నిర్వహించారు. దీనిని శాంతానుదాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఓఎన్‌జీసీ, ఎస్‌పీఎఫ్ ఉద్యోగులు, ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

శాంతానుదాస్ మాట్లాడుతూ ఈ నెల ఒకటో తేదీన ప్రారంభమైన స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమం ఈ నెల 15వ తేదీతో ముగుస్తుందన్నారు. రెండు వారాల ప్రచారంలో భాగంగా వ్యర్థాల విభజన, సైట్లు, కార్యాచరణ ప్రాంతాలలో పరిశుభ్రత డ్రైవ్‌లపై వర్క్‌షాప్‌లతో సహా అనేక కార్యకలాపాలు నిర్వహించామన్నారు. వ్యర్థాల ముప్పు గురించి యువతకు అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో క్విజ్, పోస్టర్ల తయారీ, వక్తృత్వ పోటీలు నిర్వహించామన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ప్రజలను చైతన్యం చేయడానికి వివిధ కార్యక్రమాలు చేపట్టామన్నారు.

చికిత్స పొందుతూ వ్యవసాయ కూలీ మృతి


భీమనాది సోమేశ్వరరావు (ఫైల్)

పెరవలి: గోదావరి ఏటిగట్టుపై కాలు జారి కింద పడి తీవ్రంగా గాయపడిన మండలంలోని ఖండవల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ భీమనాది సోమేశ్వరరావు (46) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెరవలి ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమేశ్వరరావు ఈ నెల 9న ఖండవల్లి వద్ద గోదావరి లంకలో పచ్చగడ్డి కోసుకుని తిరిగి వస్తుండగా ఏటిగట్టుపై కాలు జారడంతో గట్టు పై నుంచి కింద పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. అతడికి తొలుత తణుకులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమేశ్వరరావు శుక్రవారం మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మూర్తి తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

- రూ.1,51,950 స్వాధీనం
- 18 మంది జూదరుల అరెస్టు

కొవ్వూరు: స్థానిక శ్రీనివాసపురంలోని రావణ బ్రహ్మ విగ్రహం సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం రాత్రి పట్టణ పోలీసులు దాడి చేశారు. పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో దాడి చేసి 18 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1,51,950 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. కొద్దిరోజులుగా ఇక్కడ గట్టు చప్పుడు కాకుండా పెద్ద ఎత్తున పేకాట సాగుతున్నట్టు సమాచారం. దీనికి కొందరు పోలీసు అధికారులు సహకరిస్తున్నట్టు తెలిసింది. వివిధ ప్రాంతాల నుంచి కొందరు ఇక్కడకు వచ్చి పేకాడుతున్నట్టు సమాచారం. ఈ వ్యవహారాన్ని బయటకి రాకుండా చూసేందుకు పెద్ద ఎత్తున బేరసారాలు సాగినట్టు తెలిసింది. సమాచారం మీడియాకు లీక వడంతో చివరి నిమిషంలో కేసు నమోదు చేసినట్లు చెబుతున్నారు. మీడియాకు సమాచారం ఇవ్వకుండా దాచి పెట్టడంపై పోలీసులపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

గంజాయితో అనర్థాలపై విద్యార్థులకు అవగాహన


హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

తాళ్లపూడి: గంజాయి, హెరాయిన్ వంటి మత్తు పదార్థాల జోలికి విద్యార్థులు, యువత వెళ్లకుండా వారికి అవగాహన కల్పిస్తామని తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాస్ ప్రకటించారు. మండలంలో గంజాయి వినియోగం బాగా పెరిగిపోయినందున, నియంత్రణ చర్యలు చేపట్టాలంటూ బుధవారం జరిగిన తాళ్లపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మండలంలో గంజాయి నియంత్రణ చర్యలకు తహసీల్దార్ శ్రీనివాస్ శ్రీకారం చుట్టారు. ప్రత్యక్ష కార్యాచరణ కూడా మొదలు పెట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆయన మండలంలోని జెడ్పీ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులతో స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వాడకంపై కఠినంగా వ్యవహరించాలంటూ వారికి సూచించారు. డ్రగ్స్ వాడకం, నష్టాలు వంటి అంశాలపై పాఠశాలల్లో విద్యార్థులకు వివరించాలని హెచ్‌ఎంలను తహసీల్దార్ ఆదేశించారు. అలాగే గంజాయి రహిత సమాజం కొరకు మనం అనే నినాదంతో ప్రతి పాఠశాలలోను, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లోను సోమవారం నుంచి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్టు ప్రకటించారు. సమావేశంలో ఎంఈవోలు సీహెచ్ బాలామణి, సీహెచ్ నెహ్రూజీ, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షయ రోగులు పోషకాహారం తీసుకోవాలి

- జిల్లా అదనపు వైద్యాధికారి వసుంధర
- పీహెచ్‌సీ, వెల్‌నెస్ సెంటర్ సందర్శన


ఉండ్రాజవరం పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా అదనపు వైద్యాధికారి వసుంధర

ఉండ్రాజవరం: మంచి పోషకాహారం తీసుకుంటే క్షయ వ్యాధి త్వరగా తగ్గి, ఆరోగ్యంగా జీవించవచ్చని జిల్లా అదనపు వైద్యాధికారి, జిల్లా ఎయిడ్స్, కుష్ఠు, క్షయ వ్యాధి నివారణాధికారి డాక్టర్ వసుంధర అన్నారు. ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, స్థానిక హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని క్షయ వ్యాధిగ్రస్తులను పరీక్షించారు. రోగులకు పలు సూచనలు చేశారు. అలాగే ఈ పీహెచ్‌సీలోని గర్భిణుల, క్షయ వ్యాధిగ్రస్తుల రికార్డులను డాక్టర్ వసుంధర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో అంటువ్యాధులు రాకుండా కాచి చల్లార్చిన నీటిని లేదా క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే తాగాలన్నారు. ఈ పీహెచ్‌సీ సిబ్బందికి తాగునీటిని క్లోరినేషన్ చేసే విధానాన్ని, లాగ్ బుక్ నిర్వహణ గురించి అవగాహన కల్పించారు. విధిగా రోజూ వాటర్ ట్యాంక్‌లో క్లోరినేషన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యులు ఆర్‌ఎస్‌ఎస్‌వీ ప్రసాద్, డాక్టర్ ఉషాదేవి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.సుబ్రహ్మణ్యం, ఆరోగ్య పర్యవేక్షకుడు జూన్నూరి శ్రీనివాసు, నాగమణి, కె.కుమారి, క్షయవ్యాధి నివారణ పర్యవేక్షకులు ఆషాజ్యోతి, భీమరాజు, ఎల్‌టీ గంగాధర్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలించే వాహనాల సీజ్

- కొవ్వూరు అసిస్టెంట్ ఎంవీఐ జమీర్
- ఉసులుమర్రు ఇసుక గుట్టల పరిశీలన


ఉసులుమర్రులో ఇసుక గుట్టను పరిశీలిస్తున్న కొవ్వూరు ఏఎంవీఐ జమీర్

పెరవలి: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలించే ఏ వాహనాన్ని అయినా సీజ్ చేస్తామని కొవ్వూరు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ) మహ్మద్ జమీర్ హెచ్చరించారు. మండలంలోని ఉసులుమర్రు గ్రామంలోని ఇసుక గుట్టలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇసుక తరలిస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎంవీఐ మహ్మద్ జమీర్ మాట్లాడుతూ గుట్టల నుంచి ఇసుకను తరలించే వాహనాలను రవాణా శాఖ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారన్నారు. ఒక వేళ బిల్లులు లేకపోతే కేసు నమోదు చేయడంతో పాటు జరిమానా విధించడమే గాకుండా, వాహనాలను సీజ్ చేస్తామన్నారు. డీటీ సన్నిబాబు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న వారికి మొబైల్స్ అందజేత

ఉండ్రాజవరం: మండల వ్యాప్తంగా పోగొట్టుకున్న, దొంగిలించబడిన మొబైల్ ఫోన్ల రికవరీ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్టు స్థానిక ఎస్సై వి.అప్పలరాజు శుక్రవారం తెలిపారు. ఆ బృందం ద్వారా రికవరీ చేసిన సెల్‌ఫోన్లను వాటిని పోగొట్టుకున్న బాధితులకు అందజేస్తామన్నారు. దీనికోసం బాధితులు సెల్‌ఫోన్ కొనుగోలు చేసిన బిల్లు, ఐఎంఈఐ నంబర్, తమ ఆధార్ కార్డ్‌తో పోలీస్ స్టేషన్లో సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా మండలంలో రికవరీ అయిన సెల్‌ఫోన్లను సంబంధిత వ్యక్తులకు శుక్రవారం ఎస్సై అప్పలరాజు అందజేశారు. తమ మొబైల్ ఫోన్లు అందుకున్న బాధితులు ఎస్సైకి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కల పెంపకం ఉద్యమం కావాలి

- ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు
- ఉపాధి హామీ పథకంలో వన మహోత్సవం


గోపాలపురం ఏఎంసీ ఆవరణలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం: మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ ఉద్యమంలా చేపట్టాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సూచించారు. ఉపాధి హామీ పథకం కింద శుక్రవారం గోపాలపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని రైతులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. పొలాల గట్లు, చెరువులు, కాలువ గట్లపై నాటేందుకు వీలుగా మండలంలోని రైతులకు సుమారు 20 వేల కొబ్బరి మొక్కలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకుల పాటి లలిత, అతిరాస కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపీడీవో కె. రమేష్‌బాబు, ఏపీఎం జె.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఐ.పంగిడిలో

కొవ్వూరు: ఉపాధి హామీ పథకం కింద మండలంలోని ఐ.పంగిడి గ్రామంలోని కొత్త చెరువు గట్టుపై మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూటమి నాయకులు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు, జనసేన నాయకుడు చొటుపల్లి సాంబశివరావు (శివ), లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాచూరి శ్రీనివాస్, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో క్రీడోత్సవం

- టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభం
- తరలివచ్చిన క్రీడాకారులు
- మూడు రోజుల పాటు నిర్వహణ


టేబుల్ టెన్నిస్ పోటీలో తలపడుతున్న బాలికలు


పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా టీటీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు భాస్కర రామ్

ప్రకాశం నగర్: క్రీడలపై యువతకు ఆసక్తి పెరుగుతోంది. దానికి ప్రోత్సాహం కూడా తోడవడంతో అనేక మంది ఆటలపై ఆసక్తి చూపుతున్నారు. చదువులో పాటు క్రీడలపై మక్కువ చూపుతున్నారు. దీంతో తరచుగా అనేక చోట్ల టోర్నమెంట్లు జరుగుతున్నాయి. ముఖ్యంగా నగరంలో క్రీడాపోటీలకు వేదికవుతోంది. ఇక్కడి చిన్నారులు, యువత ఆటలలో ప్రతిభ చూపి జాతీయ స్థాయిలో కూడా రాణిస్తున్నారు.

ప్రస్తుతం నగరం టేబుల్ టెన్నిస్ పోటీలకు నగరం వేదికైంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులతో సందడిగా మారింది. స్థానిక నారాయణపురంలోని ఆర్ఎంసీ సిటీ బ్యాడ్మింటన్ కోర్టులో శుక్రవారం ఏపీ స్టేట్ టేబుల్ టెన్నిస్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సుమారు మూడు రోజుల పాటు వీటిని నిర్వహించనున్నారు. పది టేబుళ్లపై 25 మంది అంపైరింగ్ సిబ్బందితో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి దాదాపు 300 మంది క్రీడాకారులు సుమారు 12 విభాగాలల్లో తలపడనున్నారు. మొదటి రోజు అండర్ - 17 బాలురు, బాలికలు, అండర్ -19 పురుషులు, స్త్రీల విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈ పోటీలను జిల్లా టీటీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు విశ్వనాథం భాస్కర్ రామ్, ఉపాధ్యక్షుడు విజయ్ ప్రకాశ్ ఈ పోటీలను ప్రారంభించారు.

జాతీయ పోటీలకు ఎంపిక

ఏపీ స్టేట్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో సుమారు వివిధ విభాగాల్లో పాల్గొన్న క్రీడాకారులకు వారు సాధించిన పాయింట్ల ఆధారంగా వారికి ర్యాంకింగ్ ఇచ్చి ఆయా విభాగాల్లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. విజేతలకు నగదు బహుమతితో పాటు పతకాలు అందించనున్నారు. శుక్రవారం ప్రారంభమైన సీనియర్ విభాగాలకు శనివారం సాయంత్రం బహుమతులు అందజేయనున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

చాగల్లు: సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అధికారులకు సూచించారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో ప్రకటించిన మేనిఫెస్టో ప్రకారం పెన్షన్ల పెంపు ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు. అనంతరం మండల సమాఖ్య ఏపీఎం మంగాయమ్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెంకటేశ్వరరావును సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే ముప్పిడి గ్రామ సచివాలయాలను సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు డొక్కు లక్ష్మీపార్వతి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, జొన్నకూటి సుబ్బారావు, దొంగ రామకృష్ణ, కరుటూరి బాలకృష్ణ, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

నల్లజర్ల: మండలంలోని పోతవరం, నల్లజర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ రెండు సబ్ స్టేషన్ల పరిధిలోని నల్లజర్ల, జగన్నాథపురం, మార్రెళ్లమూడి, పోతవరం, కవులూరు, సుభద్రపాలెం, నబీపేట, కృష్ణాయిగూడెం గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ గృహ,వాణిజ్య, వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు శుక్రవారం తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ల పరిధిలోని వ్యవసాయ పంపుసెట్లకు త్రీ ఫేజ్ కరెంట్‌ను వేకువజాము 3 గంటల నుంచి 8 గంటల వరకూ తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సరఫరా చేస్తామన్నారు.

పాలంగి సబ్ స్టేషన్ పరిధిలో..

ఉండ్రాజవరం: పాలంగి విద్యుత్ సబ్ స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల కోసం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పాలంగి, కె.సావరం, చివటం గ్రామాలతో పాటు ఇండస్ట్రియల్ ఫీడర్ నందు గృహ, వాణిజ్య, వ్యవసాయ వినియోగదారులకు కరెంట్ సరాఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో నిడదవోలు ఈఈ బి.వీరభద్రరావు శుక్రవారం తెలిపారు. వ్యవసాయ విద్యుత్ (త్రీ ఫేస్) సరఫరా ఉదయం 5 నుంచి 8 గంటల వరకు, మరలా మధ్యాహ్నం 12 సాయంత్రం 5 గంటల వరకూ ఇస్తామన్నారు.

దేవరపల్లి: మండలంలోని గౌరీపట్నం విద్యుత్ సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ సబ్ స్టేషన్ పరిధిలోని గౌరీపట్నం, దుద్దుకూరు గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కరెంట్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఈఈ బి.వీరభద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఆయన తెలిపారు. వ్యవసాయానికి ఇచ్చే విద్యుత్ సరఫరాను ఉదయం 5 నుంచి 8 గంటల వరకూ, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ మార్చినట్టు తెలిపారు.

నిడదవోలు: పట్టణంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ బి. వీరభద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రామ్‌నగర్, గణేష్ చౌక్, ఓవర్ బ్రిడ్జిడౌన్, పోలీస్ స్టేషన్, గాంధీబొమ్మ సెంటర్, రైల్వే గేట్, బసివిరెడ్డి పేట, గణపతి సెంటర్, యర్నగూడెం రోడ్, నెహ్రూనగర్, విద్యానగర్, బాపూజీ నగర్, వైఎస్సార్ నగర్, జగనన్న కాలనీ ప్రాంతాల్లో విద్యుత్తు నాలుగు గంటల పాటు సరఫరా ఉండదని ఆయన వివరించారు.

చాగల్లు మండలంలో..

చాగల్లు: ఫీడర్ మరమ్మతుల నిమిత్తం చాగల్లు సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు శుక్రవారం తెలిపారు. దీనివల్ల చాగల్లు, నెలటూరు, మీనానగరం గ్రామాల్లో ఐదు గంటల పాటు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నిడదవోలు మండలంలో..

నిడదవోలు రూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మండలంలోని పురుషోత్తపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని పురుషోత్తపల్లి, విజ్జేశ్వరం, గోపవరం, పందలపర్రు, రావివారిగూడెం, డి.ముప్పవరం, కలవచర్ల, జీడిగుంట, కోరుపల్లి, మునిపల్లి, పెండ్యాల గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెరవలి మండలంలో..

పెరవలి: వార్షిక మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల కోసం పెరవలి, కానూరు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ బి. వీరభద్రరావు శుక్రవారం తెలిపారు. కానూరు సబ్ స్టేషన్ పరిధిలోని కానూరు, నడుపల్లి, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు గ్రామాలకు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ సరఫరా నిలిపివేస్తామన్నారు. అలాగే పెరవలి సబ్ స్టేషన్, అజ్జరం ఫీడర్ పరిధిలోని అజ్జరం, పెరవలి, కాకరపర్రు, వెంకట్రాయపురం, తీపర్రు గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ సరఫరాను నిలిపివేస్తామని ప్రకటించారు.